క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


జీవీపాళ్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మడకశిరరూరల్: జీవీపాళ్యం గ్రామంలో గురువారం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో జెండర్ సమావేశం నిర్వహించారు. మహిళలకు జెండర్ ఆధారిత హింస, బాలికల విద్య, బాల్య వివాహాలు, గృహహింస నిరోధక చట్టం అమలు వాటిపై అవగాహన కల్పించారు. సీసీ ముద్దప్ప మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌డీ సీసీ మంజునాథ్, ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ రంగయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు


లేపాక్షి: స్థానిక పిల్లిగుండ్లు కాలనీ సమీపంలో కొన్ని సంవత్సరాలుగా పేదలు నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సౌజన్య లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లేపాక్షిలోని సర్వే నంబర్ 455-2 భూమిలో 10 సంవత్సరాల క్రితం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంటి పట్టాలు ఇవ్వాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తెలిపారు. రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు అందినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు

అగళి: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వందరోజుల్లో ఎలా పరీక్షలకు ప్రిపేర్ కావాలో సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడివానతో వరి రైతుల ఆందోళన


సింగేపల్లి వద్ద కోతకు వచ్చిన వరి

మడకశిరరూరల్: అల్పపీడనం ప్రభావంతో గురువారం వేకువజాము నుంచి జడివాన పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చలికి వృద్ధులు ఇబ్బందులు పడుతూ ఇంటికే పరిమితమయ్యారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి, తిరిగి ఇంటికి చేరుకోవడానికి అవస్థలుపడ్డారు. కోతకు వచ్చిన వరి పంట గింజలు నేల రాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జల్లులు వర్షం కారణంగా పశువులు, గొర్రెలకు మేత మేయించడానికి కూడా ఇబ్బందులు తప్పలేదు. వారపు సంతలో కూరగాయలు విక్రయించే వ్యాపారస్తులు, కొనుగోలుదారులు ఇక్కట్లకు గురయ్యారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ


సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని చెరుకూరు గ్రామంలో టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ సాగుపై రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయ కోఆర్డినేటర్ సన్నప్పయ్య సేంద్రియ వ్యవసాయంపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు సునందమ్మ, సీఆర్‌పీలు హరీష్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


శెట్టిపల్లి బ్రిడ్జి కింద భయం భయంగా ప్రయాణిస్తున్న వాహనదారులు


మక్కాజిపల్లి బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వర్షపు నీరు


సోమందేపల్లి మండలం పందిపర్తి రైల్వే బ్రిడ్జి వద్ద ఇలా..

ప్రమాదం.. తప్పని ప్రయాణం

- చినుకు పడితే ప్రజలకు తిప్పలు
- చుట్టూ తిరిగి గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి శెట్టిపల్లికి వెళ్లే రహదారిపై ప్రమాదమని తెలిసినా..ప్రయాణం తప్పడం లేదు. శెట్టిపల్లి క్రాస్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలతో బ్రిడ్జి కింద వర్షపునీరు ప్రవహిస్తూ, బ్రిడ్జి రహదారి మొత్తం పాచిపట్టింది. బండ్లపల్లి, బైరాపురం క్రాస్ ఎర్రబల్లి, చన్నరాజుపల్లి మీదుగా దాదాపుగా 20 కిలో మీటర్లు ప్రయాణించి శెట్టిపల్లి గ్రామానికి చేరుకోవాల్సి వస్తుంది. అటుగా ప్రయాణించే గ్రామాల ప్రజలకు ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల ఓ జర్నలిస్టు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడి, ఆస్పత్రి పాలయ్యాడు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న మక్కాజిపల్లి తండాకు వెళ్లాలంటే, రైల్వే అండర్ బ్రిడ్జి దాటాల్సిందే వర్షాలు పడితే నిత్యం రైల్వే బ్రిడ్జీ జలయంగా మారిపోతుంది. బ్రిడ్జి గుండా మక్కాజిపల్లికి మాత్రమే కాకుండా, వెంకటగిరిపాళ్యం, చంద్రగిరి, గొల్లపల్లి గ్రామాల నుంచి గుట్టూరు గ్రామానికి చేరుకోవచ్చు. కియా పరిశ్రమ ఏర్పాటయిన తర్వాత ఈ ప్రాంతం ప్రముఖంగా మారింది. మక్కాజిపల్లి రహదారి రద్దీగా ఉంటుంది. వర్షాలకు బ్రిడ్జి కింద నీరు చేరితే పైగ్రామాలకు వెళ్లే ప్రజలు దుద్దేబండ క్రాస్ మీదగా, దాదాపుగా 10 కిలో మీటర్లు ప్రయాణించి గ్రామాలకు చేరుకోవాల్సి వస్తుంది. సోమందేపల్లి మండలంలోని పందిపర్తి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి గ్రామానికి చేరుకోవాల్సి ఉంది. గ్రామంలో దాదాపుగా 1500 జనాభా నివసిస్తున్నారు. నిత్యం గ్రామం నుంచి సోమందేపల్లికి వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. వర్షంపడితే అండర్ బ్రిడ్జికిందకు నీరు చేరుతుంది. ప్రమాదం అని తెలిసినా ప్రజలు రైల్వే పట్టాలపై దాటి వెళ్లక తప్పదు.

ఇబ్బందికరంగా రైల్వే బ్రిడ్జి



వర్షం పడితే రైల్వే బ్రిడ్జి గుండా ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా మారుతుంది, వర్షాలు అధికంగా కురిస్తే బ్రిడ్జి గుండా ప్రయాణించే అవకాశమే ఉండదు. జాతీయ రహదారి పక్కనే ఉన్నప్పటికీ రోడ్డు మీదకు వెళ్లాలంటే, పది కిలో మీటర్లు పైబడి ప్రయాణించి చేరుకోవాల్సి వస్తుంది.
– చంద్రానాయక్ మక్కాజిపల్లి తండా

20 కిలో మీటర్లు చుట్టి రావాలి



భారీ వర్షాలు కురిస్తే గ్రామానికి చేరుకోవాలంటే ఇబ్బందే. రైల్వే వంతెన కింద నీటి ప్రవాహం పెరిగితే గ్రామానికి చేరుకోలేం. బండ్లపల్లి,బైరాపురం క్రాస్, ఎర్రబల్లి, చన్నరాజుపల్లి మీదుగా దాదాపుగా 25 కిలో మీటర్లు మేర ప్రయాణించి గ్రామానికి చేరుకోవాలి. వర్షాలకు నిత్యం బ్రిడ్జి కింద వర్షపునీరు ప్రవహిస్తుంది. రహదారి పాచి పట్టి ద్విచక్రవాహనాలు బోల్తాపడిన ఘటనలూ ఉన్నాయి.
– అమర్‌నాథ్‌రెడ్డి, శెట్టిపల్లి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హిందూపురం: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని సీఐటీయూ పట్టణ నాయకుడు వీఆర్ రాము మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 45 వేల మంది 25 ఏళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు నెల నెల జీతాలు ఇవ్వలేకపోతోందన్నారు. హిందూపురం మున్సిపాలిటీ విస్తీర్ణం పెరిగి వ్యర్థాలు, రోడ్లు, వీధులు పెరుగుతున్నప్పటికీ కార్మికుల సంఖ్య పెంచడం లేదన్నారు. అంతేగాక ఆరు నెలలుగా పనిముట్లు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులకు సేఫ్టీమెజర్స్ లేక రకరకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విజయవాడలో వరదలు వచ్చినప్పుడు ఇక్కడ నుంచి అక్కడ వెళ్లి పని చేసిన వర్కర్లకు రెండు జతలు బట్టలు, రూ.1,500 ఇవ్వాలని ప్రభుత్వ సర్కులర్ వచ్చినప్పటికీ హిందూపురం మున్సిపాలిటీలో అమలు చేయలేదని విమర్శించారు. అడిషనల్ వర్కర్లు 85 మందికి మూడు నెలల నుండి జీతాలు ఇవ్వలేదని గుర్తు చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో డిసెంబర్ 20వ తేదీ తర్వాత మళ్లీ సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లికార్జున, ఆనంద్, రామచంద్ర, బాబయ్య, చంద్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మడకశిర: విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వివిధ అంశాల పై ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాలికలు ఎవరైనా ఇబ్బందులు, వేధింపులకు గురి చేస్తుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా బాగా చదువుకోవాలని కోరారు. టౌన్ సీఐ రాగిరిరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాబయ్య స్వామికి చాదర్ సమర్పణ


పట్టు చాదర్ తీసుకెళ్తున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలోని సీపీఐ అనుబంధ కమిటీ అయిన ఇన్‌సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో బాబాయ్య స్వామికి గురువారం చాదర్ సమర్పించారు. బాబాయ్య స్వామి 752 గంధం వేడుకలను పురస్కరించుకుని చాదర్ సమర్పించిన ఇన్‌సాఫ్ కమిటీ నాయకులు.. అనంతరం బాబయ్య స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, జాఫర్‌వలి, వెంకటేసులు, కిష్టప్ప, వెంకటరాముడు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

రోజంతా వాన


మండలంలో కురుస్తున్న వర్షం

చిలమత్తూరు: ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా గురువారం తెల్లవారుజాము నుంచి రోజంతా చిరుజల్లులు కురిశాయి. చలిగాలులతో కూడిన వాన కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. పంట కోతలు ప్రారంభం కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని సమాచారం.

కల్వర్టు మరమ్మతు


కల్వర్టు వద్ద మట్టి తోలిన దృశ్యం

గుడిబండ: గుడిబండ నుంచి రొళ్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఫళారం గ్రామం సమీపాన ఉన్న రోడ్డు కల్వర్టు వద్ద రెండు నెలల క్రితం కురుసిన భారీ వర్షానికి రోడ్డు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. సమస్యను గుర్తించిన స్థానిక సర్పంచ్ సతీష్ గురువారం జేసీబీ, ట్రాక్టర్ సాయంతో రోడ్డుపైనున్న పెద్ద గుంతలను మట్టితో పూడ్చి తాత్కాలిక మరమ్మతు చేశారు. ప్రజల సమస్యపై శ్రద్ధ చూపడంతో సర్పంచ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'ఆన్ జాబ్ ట్రైనింగ్' తనిఖీ


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు

మడకశిర: మడకశిర వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇస్తున్న ఆన్‌జాబ్ ట్రైనింగ్‌ను గురువారం జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రభాకర్, జయచంద్ర, శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ కోర్సుపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. అలాగే జూనియర్ కళాశాల వెనుక భాగంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థుల శిక్షణను తనిఖీ చేశారు. వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్ మహేష్, అధ్యాపకులు శ్రీనివాసులు, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం


పోస్టర్లను విడుదల చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి టిఎన్.దీపిక, పార్టీ శ్రేణులు

హిందూపురం: ఆరు నెలలు వేచి చూశాం.. ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఏ ఒక్కటి కూడా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని నియోజకవర్గ ఇన్‌చార్జి టిఎన్. దీపిక అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన నెరవేర్చలేదన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు పరిచిన పథకాలన్నీ నీరుగార్చిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలో ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. శాంతీయుత ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


తమ్మడేపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

అమరాపురం: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మారుతిప్రకాష్ పేర్కొన్నారు. గురువారం తమ్మడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మడేపల్లి, 1, 2 సచివాలయాల పరిధిలోని రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వివిధ సమస్యలపై మొత్తం 52 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు రొళ్లలో రెవెన్యూ సదస్సు

రొళ్ల: స్థానిక సచివాలయం-1 ఆవరణలో శుక్రవారం ఉదయం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయాలని సూచించారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి


తమ్మడేపల్లిలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, అమరాపురం, హాలుకూరు, గౌడనకుంట, పుల్లీకుంట, వీరాపురం, హేమావతి గ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తమ్మడేపల్లిలో ఆంజనేయస్వామికి శుక్రవారం ఉదయం నుంచి వివిధ రకాల అభిషేకాలు, బియ్యంతో పూజ నిర్వహిస్తారు. అలాగే 11 గంటల నుంచి రాత్రి వరకూ బంగారుపాళ్యం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప సోదరులు భక్తులకు అన్నదానం చేయనున్నారు. శనివారం దీపోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మిగతా గ్రామాల్లో జయంత్యుత్సవంతో పాటు ఊరేగింపు కార్యక్రమం, అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అరళికుంటె గ్రామంలో..

పావగడ: అరళికుంటె గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అంజనేయ స్వామి ప్రత్యేక అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. భవాని శంకర దేవాలయంలో పద్మశాలి అవారం మహిళా బృందం ఆలపించిన శివ పంచాక్షర నక్షత్ర మూలాస్తోత్ర పారాయణం భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయంలో భరత నాట్యం, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షుడు వై హెచ్ వెంకటాచలప్ప మాట్లాడుతూ ఈ సారి 14 వ వార్షిక హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నా మన్నారు.

కోళ్లు అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ద్వారకామయి నగర్‌లో గురువారం తెల్లవారుజామున ఇంటివద్ద పెంచుకుంటున్న 18 నాటు కోళ్లను దుండగులు ఎత్తుకెళ్లారు. వెంకటనారాయణ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నాలుగు రోజులుగా మండల కేంద్రంలో మూడు వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు, హోటళ్లు, దుకాణాలపై శానిటేషన్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. పశువుల ప్లాస్టిక్ కవర్లు తిని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శివయ్య, సెక్రటరీ మోహన్, ఉమాశంకర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ర్యాలీ

రొద్దం: జిల్లా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య ఓ ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు రొద్దం నుంచి వివిధ వాహనాల్లో పెద్ద ఎత్తున రైతులతో కలిసి నాయకులు బయల్దేరనున్నట్లు తెలిపారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన


ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పెనుకొండ రూరల్: విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఏడీ శేషగిరికి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ నిత్యావసర ధరలతో ఇప్పటికే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా అధ్యక్షురాలు జయమ్మ, శ్రీరాములు, నరసింహులు, వెంకటేష్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు జపానంద అండ


సరుకుల కిట్లు సిద్ధం చేస్తున్న వలంటీర్లు

పావగడ: స్థానిక రామకృష్ణాశ్రమాధిపతి స్వామి జపానంద తమిళనాడులోని ఫెంగల్ తుపాన్ బాధితులకు అండగా నిలవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బాధితులకు అందజేసేందుకు నిత్యావసర కిట్లు సిద్ధం చేస్తున్నారు. గురువారం జపానంద స్వామీ జీ మాట్లాడుతూ.. ఫెంగల్ తుఫాను బాధితులకు త్వరలో నిత్యావసర సరుకుల కిట్లు, వంట సామగ్రి, దుప్పట్లు అందిస్తామన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


కాకి ప్రాథమిక పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం రత్నగిరి, కాకి తదితర ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. ఎండీఎం నిర్వహకులు మెనూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఏ-1 పరీక్షల సమాధాన పత్రాలను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల స్వాధీనం

రొళ్ల: వన్నరనపల్లి గ్రామంలో ఓ మహిళ నుంచి కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు మడకశిర ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు గురువారం సాయంత్రం తెలిపారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సీఐ సీఐ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దాడులు చేపట్టిందన్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన లావణ్య అనే మహిళ నుంచి 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ ఆమెపై కేసు నమోదు చేశారన్నారు. మడకశిర ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో గురువారం ఓ వ్యక్తికి తీవ్ర గాయాలతో పడివుండటాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ మురళీ అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం అతన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు, మద్యం మత్తులో గాయపడ్డాడా? లేక ఏదైనా ప్రమాదం జరిగిందా తదితర వివరాలు తెలియాల్సి ఉంది.